క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



నెహ్రూనగర్: విద్యార్థులు ఉన్నల లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని యేరువ కోటిరెడ్డి మోమోరియల్ ట్రస్ట్ చైర్మన్ యేరువ సాయిరామ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్‌లో విద్యార్థులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నేను కూడా ఎన్నో ఇబ్బందులు పడ్డానని.. దాతల సాయంతో ఇప్పుడు ఈ స్థాయిలోకి వచ్చానని పేర్కొన్నారు. హాస్టల్‌లో చదివే విద్యార్థులు దాతల సహాయ సాహకారాలను అందిపుచ్చుకుని భవిష్యత్‌ను అందంగా రూపుదిద్దుకోవాలన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ అభివృద్ధికి రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమస్యలపై ప్రజలు 0863–2224202 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో భాగంగా కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ వివరించారు.

శ్రావ్యంగా శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో యువ కళాకారులతో శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి ఆదివారం నిర్వహించారు. ఈశ్వర వరప్రసాద పరిషత్ (గుంటూరు) ఆధ్వర్యంలో జరగ్గా, శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు గిరిజాశంకర్, సలహాదారు నేతి విశ్వేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. విద్వాన్ డి.రాఘవాచారి(హైదరాబాద్ బ్రదర్స్) శిష్యులు చిరంజీవి సత్కృత్ ఆనంద్ మధుర గానంతో అలపించారు. వయోలిన్‌పై శ్రీకృష్ణరాఘవ(హైదరాబాద్), మృదంగంపై సి.హెచ్. సూర్య (గుంటూరు) వాయిద్యాన్ని అందించారు. కళాకారులను మోదుగుల రవికృష్ణ, పసుపులేటి శ్రీధర్ సత్కరించారు.

గ్రామాల్లో వివక్షను రూపుమాపేందుకు కృషి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్

నెహ్రూనగర్: గ్రామాల్లో జరిగే వివక్షను రూపుమాపడానికి తగిన కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన్ను దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఏసీ కళాశాలలోని అసెంబ్లీ హాలులో అభినందన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు నక్కా ఆనంద బాబు, నసీర్ అహ్మద్, లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్‌బాబు మాట్లాడుతూ దళితులపై జరిగే దాడులు నియంత్రించేందుకు క్షేత్ర స్థాయిలో కృషి చేస్తానని చెప్పారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల కోసం దళిత ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో పట్టుబట్టాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లు లేకుండా కమిషన్ పనిచేస్తుందని పేర్కొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పట్నంబజార్: ఓ వ్యక్తి మనస్తాపంలో గడ్డి మందు తగిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన ఆలపాటి గోపిరాజు ఏటుకూరు రోడ్డులో లారీ సర్వీస్ స్టాండ్‌ను నిర్వహిస్తున్నారు. అతడు నివాసం ఉండే గ్రామానికి చెందిన ధనుంజయ అనే వ్యక్తి వద్ద రూ.3,00,000 అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో గత కొద్ది రోజులుగా వడ్డీని చెల్లించడం లేదు. ఆదివారం ఏటుకూరు రోడ్డులోని గోపిరాజు కార్యాలయం వద్దకు వచ్చిన ధనుంజయ అతని బైకును లాక్కొని వెళ్లిపోయాడు. దీనితో మనస్తాపానికి గురైన గోపిరాజు గడ్డి మందు తాగాడు. ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ట్రీట్‌మెంట్ ఇవ్వగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలపై దృష్టి

- జిల్లా అధ్యక్షుడు అంబటి
- జిల్లా, నగర కమిటీ ఏర్పాటుపై చర్చ



కమిటీల ఏర్పాటుపై చర్చిస్తున్న అంబటి, నూరిఫాతిమా, మస్తాన్‌వలి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా, నగర అనుబంధ విభాగాల కమిటీలపై నేతలు దృష్టి సారించారు. పూర్తి స్థాయిలో కమిటీ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. దీనిపై ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశంపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌చార్జి షేక్ మస్తాన్‌వలి భేటి అయ్యారు. పూర్తిస్థాయిలో కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు దృష్టి సారించనున్నారు. దానిలో భాగంగా పార్టీలో క్రియాశీలకంగా పాటుపడుతున్న ప్రతి ఒక్కరికి గుర్తింపునిచ్చేలా పదవులు కేటాయించాలని నిర్ణయించారు.

కార్యకర్తలకు ప్రాధాన్యం..

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ జిల్లా, నగర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో కమిటీల ఏర్పాటుకు దృష్టి సారిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీలో కార్యకర్తలకే తొలి ప్రాధాన్యం ఉంటుందని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఎత్తిన జెండాను భుజాన దించకుండా పాటుపడిన అందరికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. కష్టపడి పనిచేసే వారికి అధిక ప్రాధాన్యతిచ్చేలా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ నగర కమిటీల రూపకల్పన కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన కమిటీలు పూర్తి అయ్యేలా కృషి చేస్తామని వెల్లడించారు. జిల్లా, నగర కమిటీలు త్వరగా పూర్తి చేయాలని షేక్ మస్తాన్‌వలి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షులు షేక్ నూరిఫాతిమాకు సూచించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

నగర ట్రాఫిక్ డీఎస్పీ రమేష్



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ

పట్నంబజారు: నగరంలో శంకర్‌విలాస్ ఫ్లెఓవర్ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పూర్తి స్థాయిలో క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ ఆదేశించారు. నగరంపాలెంలోని డీఎస్పీ కార్యాలయంలో ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు ఏ అశోక్, సింగయ్యతో పాటు ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.రమేష్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరారు. అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో సిబ్బందిని అధికంగా నియమించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వాహన రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్‌లు చేయటంతో పాటు, వాహనదారులకు అవగాహన కల్పించేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మూడు వంతెనలు, అండర్‌పాస్ వద్ద వర్షం నీరు నిల్వ లేకుండా కార్పొరేషన్ కమిషనర్‌తో ఎస్పీ చర్చించనున్నట్లు వివరించారు. అమరావతి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను లాడ్జిసెంటర్, లక్ష్మీపురం, కంకరగుంట బ్రిడ్జి మార్గంలో పంపాలని సూచించారు. కొన్ని భారీ వాహనాలు లాడ్జిసెంటర్, శ్రీనగర్, మూడు వంతెనల మీదుగా డైవర్షన్ చేయాలని, మిగిలిన వాహనాలను శంకర్‌విలాస్ బ్రిడ్జి మీదుగా అనుమతించాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించే దిశగా బోర్డులు, చిత్రపటాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని, తద్వారా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐలు సాంబశివనాయక్, రవీంద్ర, డి.శ్రీహరి పాల్గొన్నారు.

సమ్మర్‌పేట చెరువు అభివృద్ధికి చర్యలు



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని సమ్మర్‌పేట చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం శిల్పారామం చెరువు, జేకేసీ కాలేజీ రోడు, పట్టాభిపురం రోడ్డు, తదితర ప్రాంతాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సమ్మర్‌పేట చెరువు శిల్పారామానికి అనుసంధానంగా ఉంటుందని, చెరువు సమగ్ర అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. నగరంలోని ప్రధాన వీధుల్లో ఆక్రమణలను గుర్తిస్తే తొలగించాలని ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లో చికెన్, మటన్ దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ సంచుల వినియోగం నిషేధంలో భాగంగా ప్రజలు స్టీల్ బాక్స్ తెచ్చుకుంటే వారికి రాయితీ ఇవ్వాలని, ప్రతి స్టాల్‌లో కనిపించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ ఐజాక్, కార్పొరేటర్ స్మిత పద్మజ పాల్గొన్నారు.

ఆగస్టు 18న ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గం ఎన్నికలు

నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలు ఆగస్టు 18న నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనతో తెలిపారు. ఎన్నికలలో 8 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, నలుగురు(2 పురుషులు+2 స్త్రీలు) ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎన్నికకు ఎలక్షన్ నిర్వహించుట జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు ఈ నెల జూలై 29న ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ చేయుట జరుగుతుందని, జూలై 30 నుంచి ఆగస్టు ఒకటి వరకు ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని చెప్పారు. గస్టు 2న ఉదయం 9 గంటలకు ఎన్నికలలో నిలబడిన అభ్యర్థుల జాబితా ఎన్టీఆర్ స్టేడియంలో ప్రదర్శించబడుతుందని వివరించారు. ఆగస్టు 4న 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల స్క్రూటినీ, స్క్రూటినీ పూర్తయిన తరువాత వ్యాలిడ్ అయిన నామినేషన్లను ప్రకటించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తరువాత ఫైనల్ నామినేషన్ల ప్రకటిస్తామని చెప్పారు. ఆగస్టు 18న ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి, 2 గంటల తర్వాత కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలను వెల్లడించనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ నందు 2,126 మంది సభ్యులు ఉన్నారని, పాలకవర్గ ఎన్నికలలో పోటీ చేయదలచిన అభ్యర్థులు ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉండాలన్నారు.

సమాజ హితమే లక్ష్యంగా మద్దినేని సేవలు



మద్దినేని సుధాకర్ దంపతులను సత్కరించిన భాష్యం రామకృష్ణ, కోయ సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ హితమే లక్ష్యంగా భావించి ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా తనదైన చెరగని ముద్ర వేసిన మద్దినేని సుధాకర్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారిగా నియమితులవ్వడం అభినందనీయమని డాక్టర్ యర్రా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో డాక్టర్ మద్దినేని సుధాకర్‌కు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను రక్తదానం చేయడమే కాకుండా ఎంతోమందికి రక్తదాన ఆవశ్యకతను తెలియపరిచి ప్రాణదాతగా నిలిచిన సుధాకర్ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో 30 ఏళ్లుగా గణిత అధ్యాపకునిగా సేవలందించడంతో పాటు 23 ఏళ్లుగా కళాశాల ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారిగా విధులు నిర్వర్తించడం సాధారణ విషయం కాదని, వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధత ఉన్నవారికే ఇది సాధ్యపడుతుందన్నారు. జేకేసీ కళాశాలలో 1986–89 సంవత్సరంలో డిగ్రీ విద్యనభ్యసించిన మిత్ర బృందం అంతా కలిసి సుధాకర్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారిగా నియమితులైన సందర్భంగా ఈ ఆత్మీయ అభినందన సభ నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల తెలంగాణ పీఆర్వో గొర్నేని రవికుమార్ మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతను అందరికీ తెలియజేస్తూ వందసార్లు రక్తదానం చేసిన మద్దినేని సుధాకర్ రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోవడంతో పాటు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడం ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా నిలిచిందన్నారు. అనంతరం మద్దినేని మిత్ర బృందం మద్దినేని సుధాకర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో 1986–89 బ్యాచ్ మద్దినేని మిత్రబృందం గంటా పున్నారావు, జమ్ముల శ్యామ్ కిషోర్, కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, ఇ.దుర్గాప్రసాద్, మలినేని పెరుమాళ్ళు, సరిపూడి అనిల్ కుమార్, రాయపాటి అమృత్, రాయల్ సుబ్బారావు, వీరేంద్ర చౌదరి, ఎన్వీరత్తయ్య, వికాస్ శంకరావు, సుఖదేవ్, గొడవర్రు గ్రామస్తులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ వి.వెంకట నాయుడు



మాట్లాడుతున్న యురాలజిస్ట్ వెంకట నాయుడు

లక్ష్మీపురం: పెద్ద వారిలో ముఖ్యంగా ప్రోస్టేట్‌కు సంబంధించిన సమస్యలు ఎక్కువగా కనబడుతున్నాయని ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ వి.వెంకట నాయుడు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రోస్టేట్ సంబంధించిన సమస్య ఉత్పన్నమైనప్పుడు మూత్రం సరిగ్గా రాకపోవడం, ఆగి ఆగి రావటం, మూత్రం ధార సన్నగా రావడం, మూత్రం త్వరగా పడిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనబడితే వెంటనే యూరాలజిస్ట్ కలిసి తగిన వైద్యం తీసుకోవాలన్నారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ వెంకట నాయుడును ఘనంగా సత్కరించారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, రాడికల్ హ్యూమనిస్ట్ కె.చంద్రశేఖరరావు, గాయత్రి బ్యాంక్ మేనేజర్ సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

పీ4లో మూడు వేల కుటుంబాలను భాగస్వామ్యం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్

నగరంపాలెం: పేదరికం లేని సమాజ నిర్మాణ కోసం పీ4ను అందుబాటులోకి తీసుకొచ్చారని తూర్పు ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ అన్నారు. కొత్తపేట ఫ్యాన్సీ కల్యాణ మండపంలో ఆదివారం ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ (ఐసీసీ) వ్యాపారుల ప్రతినిధుల సమావేశం నిర్వర్తించారు. అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ మాట్లాడుతూ పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఐసీసీ పరిధిలో సుమారు 35కి పైగా సంఘాల ఉన్నాయని చెప్పారు. ఒక్కొక్క సంఘం సుమారు వంద కుటుంబాల బాధ్యత తీసుకోవాలని కోరారు. కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. వచ్చే నెల 15 నాటికి మూడు వేల కుటుంబాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఐసీసీ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ సంఘం తరఫున కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెప్పారు. అధ్యక్షత వహించిన యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని పీ4ను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తి



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరిఫాతిమా



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆదివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నగరంలోని 35వ డివిజన్‌లోని జూట్ మిల్లు వద్దన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ భారత రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాలకు ఆయన అందించిన సేవలకు గాను 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ప్రసిద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

గుంటూరు మెడికల్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సాంబశివరావు ఆధ్వర్యంలో స్థానిక పట్టాభిపురంలోని కలాం విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ కటిక పేదరికంలో పుట్టి న్యూస్ పేపర్ బాయ్ గా జీవనాన్ని ప్రారంభించి, భారత దేశ రాష్ట్రపతిగా ఆయన ఎదగడాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్, జోనల్ ఇన్‌చార్జి షేక్ రఫీ, హేమంత్ సోలంకి, మైనారిటీ నాయకులు మౌలాలి, షేక్ ఫర్హానా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, తోటశ్రీనివాస్, కార్యదర్శులు నారాయణరెడ్డి, నారదాసు వీరమణి, సురేష్ జైన్, పవన్ కుమార్, మనోజ్, అనిల్, వైవీ సుబ్బారావు, తానుచింతల అనిల్, బోలగాని సాంబయ్య, తాడువాయి రామకృష్ణ పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం జీవితం యువతకు ఆదర్శం

పట్నంబజారు: దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కీర్తించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో పుట్టి.. రాష్ట్రపతి దేశానికి సేవలు అందించేందుకు ఆయన చేసిన కృషి యువతకు ఆదర్శమన్నారు. దేశ రక్షణ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. విద్య ద్వారానే ఉన్నతి సాధ్యపడుతుందని చాటిచెప్పిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ప్రసిద్ధి పొందిన ఆయన ప్రతి ఒక్కరికి ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నందేటి రాజేష్, షంషేర్, రమేష్, కీసరి సుబ్బులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

గుంటూరు ఎడ్యుకేషన్: భారత రక్షణ రంగ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలు అందజేసిన సిసలైన భారతరత్నం ఏపీజే అబ్దుల్ కలాం అని రెడ్ క్రాస్ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రరాజు అన్నారు. ఆదివారం జిల్లా యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్స్‌లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు రవి శ్రీనివాస్, మేకల రవీంద్ర, నిశ్చల్ కుమార్, రవి, అయ్యప్ప, రెడ్ క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం దేశానికి ఆదర్శం

గుంటూరు వెస్ట్: భారత రత్న, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మన దేశానికే ఆదర్శమని లాఫింగ్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ కొనియాడారు. కలామ్ వర్ధంతిని ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించాయి. వజీర్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా కలాం చేసిన సేవలు ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. అద్భుతమైన మేధతో పాటు గొప్ప వ్యక్తిత్వమే భారతీయుల గుండెల్లో చిరకాలం గుర్తిండిపోయేట్లు చేసిందన్నారు. అనంతరం కలాం చిత్రపటానికి లాల్ వజీర్‌తోపాటు లక్ష్మి, శర్మ కిషోర్, కమల, శివప్రసాద్, మాల కొండయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న రామచంద్రరాజు



కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లాల్ వజీర్ తదితరులు

రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు బాబూరావు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

లక్ష్మీపురం: రాజధాని నిర్మాణానికి అప్పులతో కాకుండా కేంద్రం నుంచి నిధులు సాధించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కూటమి కీలక ప్రజా ప్రతినిధులు, మంత్రులు లోకేష్, పెమ్మసాని, మనోహర్ తదితరులు ఉన్నా జిల్లాలో అభివృద్ధి కనిపించడం లేదని చెప్పారు. ముఖ్యమంత్రి నివాసం, రాజధాని అమరావతి జిల్లాలోనే ఉన్నా, జిల్లా ప్రజల స్థితిగతులు ఈ పాలనలోను ఏమాత్రం మెరుగుదల కాలేదని చెప్పారు. అమరావతి నిర్మాణానికి భూములు తీసుకుని 11 ఏళ్లు గడిచి పోయినా, రైతు, కూలీలకు, ప్రజలకు చట్టబద్ధంగా ఇచ్చిన హామీలు నెరవేరలేదని వివరించారు. ఉచిత విద్య, వైద్యం హామీ గాలికి వదిలేశారన్నారు. కొత్త పరిశ్రమలు, సంస్థలు లేవు, ఉపాధి లేదని చెప్పారు. రాజధానికి తొలి దశలో తీసుకున్న 34 వేల ఎకరాల అభివృద్ధికే దిక్కులేదనుకుంటే, మరో 44 వేల ఎకరాల భూ సమీకరణ ప్రకటనలతో ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగపూర్ చుట్టూ తిరగటం కాదు, కేంద్రం, మోదీపై ఒత్తిడి తీసుకురండి, విభజన చట్ట ప్రకారం రాజధానికి నిధులు సాధించాలని డిమాండ్ చేశారు. మోదీ రాజధానికి రెండుసార్లు వచ్చినా, చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి, ఉపన్యాసాలు తప్ప ఒరిగిందేమీ లేదని విమర్శించారు. వక్ఫ్ భూములను బడా సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కేంద్రంలో కీలక బాధ్యతలలో ఉండి కూడా గుంటూరు ఫ్లైఓవర్‌కు అవసరమైన నిధులు తేకుండా, బ్రిడ్జి సైజు తగ్గించడం విడ్డూరంగా ఉందని చెప్పారు. కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, భారాలు పెంచడమే తప్ప, సంక్షేమ పథకాల అమలు నామమాత్రమేనని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ మిర్చి, బర్లి పొగాకు, పత్తి తదితర ఏ పంటకు గిట్టుబాటు ధర లేదని, గుంటూరు చానల్‌కు నిధులు లేవు, పనులు లేవు అన్నారు. విద్యుత్ బిల్లులు కట్టలేక, ప్రభుత్వ సహాయం అందక స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలపై మోజు తప్ప, నాగార్జున యూనివర్సిటీ అభివృద్ధిపై దృష్టి లేదని విమర్శించారు. గుంటూరులో మేయర్ పదవి దక్కించుకోవడంపై ఉన్న నగర అభివృద్ధిపై లేదన్నారు. విద్యుత్ భారాలు, అదానీ స్మార్ట్ మీటర్లు, ఇళ్ళు, పట్టాలు, హామీల అమలుకై ఉద్యమాలకు సిద్ధం కావాలని, పాలకులను నిలదీయాలని, ప్రజలను కూడగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎస్.భావన్నారాయణ, ఎం.రవి, కె.నళినీకాంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



రాంబాబు

లక్ష్మీపురం: పనికి వెళ్లి నెల రోజులు అయిన తిరిగి రాక పోవడంతో అరండల్‌పేట పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శారదా కాలనీ 7వ లైన్ ప్రాంతానికి చెందిన రాంబాబు అనే వృద్ధుడు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ సెంటర్‌ల వద్ద హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే జూన్ 5వ తేదీన ఇంటి నుంచి హోటల్‌కు వెళ్లి నెల రోజులు గడిచిన ఇంత వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలలో పని చేసిన ప్రాంతాలలో వెతుకలాడగా ఎంతకు కనిపించక పోవడంతో రాంబాబు కుమారుడు సిరిగిరి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట ఎస్ఐ కృష్ణబాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, 8688831332, ఎస్ఐ కృష్ణబాజీ, 8886892134, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ 0863–2231955 నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

విద్యార్థి దశలో తెలుగు భాష సంజీవని

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ప్రాథమిక విద్యాభ్యాసం దశలో తెలుగు భాష ఉచ్ఛారణ, చేతిరాతపై చక్కటి పట్టు సాధించటం ద్వారా వారు మిగతా భాషలను సునాయాసంగా నేర్చుకోగలుగుతారని మేక్ మై జీనియస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్వీ భాస్కర్ రాజు పేర్కొన్నారు. ఆదివారం నగరంపాలెంలోని ప్రజ్ఞ పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు దోషాలు లేకుండా చక్కటి ఉచ్ఛారణ, వ్యాకరణతో తెలుగులో మాట్లాడటం, రాయడంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్వీ భాస్కర్ రాజు మాట్లాడుతూ మాతృభాషపై పట్టు ఉంటూనే ఇతర భాషలను నేర్చుకోవడం సులువుతుందనేది అక్షర సత్యమన్నారు. పిల్లల చేత తెలుగులో చదివించడం, రాయించటం ఒక వ్యాపకంగా మారడం ద్వారా తెలుగు భాషలో మాధుర్యాన్ని ఆస్వాదిస్తారన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గమనం మాట్లాడుతూ విద్యార్థుల్ని విజువల్ లెర్నర్స్‌గా మార్చేందుకు ఉపాధ్యాయులు నిరంతరం ప్రయత్నం చేయాలని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడారు. కార్యక్రమంలో స్త్రైవీ అకాడమీ డైరెక్టర్ రవి, వెంకట్, పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.